క్లుప్తంగా

సారా నిర్మూలనకు సహకరించాలి

● పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

జియ్యమ్మవలస: సారా నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు కోరారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మహిళా పోలీసులతో సమావేశమై 4, 6 సెక్షన్లపై అవగాహన కల్పించారు. సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా నేరమని, వీటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత గ్రామస్తులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ సచివాలయ పోలీసులదే బాధ్యత అన్నారు. సారాతో పట్టుబడిన వారికి కఠిన శిక్షలు అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అనీష్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

● సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



బిటివాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

వీరఘట్టం: అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని బిటివాడ గ్రామ నాగావళి నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గ్రామ నదీతీరాన్ని సందర్శించిన ఆయన ఎవరైనా ఇసుకను తరలిస్తే తన దృష్టికి తీసుకురావాలని, లేకపోతే గ్రామ సచివాలయ అధికారులకు తెలియజేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

పాలకొండ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. గురువారం ఇదే విషయమై స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, యాప్ హాజరులో కార్మికులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘ నాయకులు పడాల వేణు, భాస్కరరావు, సంజీవి, సురేష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

సీతంపేట: స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఏర్పాటు గురువారం జరిగింది. మండల అధ్యక్షునిగా కె.సింహాచలం, సహాధ్యక్షులుగా రామారావు, పి.చంద్రకళ, ప్రధానకార్యదర్శిగా ఎస్.గణేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా త్రినాథరావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయండి

వీరఘట్టం: డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన గ్రామ సంఘాలను బలోపేతం చేయండి అని వెలుగు ఏపీడీ నారాయణరావు సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఎఫ్‌లతో సమావేశమైన ఆయన మండలంలో గ్రామ సంఘాల నిర్వహణ చాలా దారుణంగా ఉందని, సంఘాలకు ఇస్తున్న స్త్రీ నిధి, ఉన్నతి తదితర రుణాలను రికవరీ చేయడంలో సీఎఫ్‌లు విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలతో వారి జీవనోపాధులు మెరుగుపరచాలన్నారు. సమావేశంలో ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏ.పి.ఎం జి.శివున్నాయుడు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న పదోతరగతి పరీక్షల ప్రత్యేకాధికారి చంద్రమ్మ

కురుపాం: పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు కృషిచేయాలని పదోతరగతి పరీక్షల ప్రత్యేకాధికారి పి.చంద్రమ్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించిన ఆమె పాఠశాల రికార్డులు, కిచెన్ గార్డెన్, నాడు–నేడు పథకం పనులు, స్టాక్ రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నల ద్వారా గమనించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు.

ముక్కంటిని మొక్కుదాం..

● శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు
● ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమైన నిర్వాహకులు
● భక్తులకు ఇబ్బంది లేకుండా సదుపాయాలు
● అన్నిచోట్ల నెలకొన్న ఆధ్యాత్మిక శోభ



తంపటాపల్లిలో లింగరూపరంలో దర్శనమిస్తున్న ఉమామహేశ్వర, వీరభద్రస్వాములు



భామిని: పక్కుడుబద్రలో వెలసిన స్వయంభూలింగం

పాలకొండ రూరల్: శివరాత్రి ఉత్సవాలకు పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. దాదాపు 20 ఏళ్ల తర్వాత శనిత్రయోదశి, శివరాత్రి ఒకేరోజు వస్తుండడంతో భక్తులంతా శని పూజలు చేసి, శనిదోషం నివారించుకునేందుకు ఉవ్విళ్లూరుతుండడం విశేషం. ఈ నేపథ్యంలో పాలకొండ మండలంలోని చినమంగళాపురం, కోటిపల్లి, తుమరాడ, బెజ్జి, అన్నవరం గ్రామాల్లోని శివాలయాలు, పాలకొండ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరి, కాశీవిశ్వేశ్వర, సదాశివ ఆలయాలతో పాటు జగన్నాథస్వామి మందిరం దగ్గరున్న భీమలింగేశ్వర, రాజలింగేశ్వర, సోమేశ్వర, ఉమారామలింగేశ్వర, గోఖర్ణేశ్వరాలయాల్లో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి.

సనారీ విశిష్టత..


పాలకొండ కోమటిపేటలోని శ్రీసింహాద్రి అన్నపూర్ణ సహిత జగద్గురు సనారీ విశ్వేశ్వర అవధూత ఆలయం జిల్లాలోనే ప్రసిద్ధి. శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయం తర్వాత అంతటి ప్రాముఖ్యత ఈ ఆలయానికి ఉంది. దాదాపు 300 సంవత్సరాల క్రితం క్షీరాచలంగా పిలవబడే నేటి పాలకొండలోని కోమటిపేటలో జన్మించిన స్వామి స్వయంగా బంగారాన్ని సిద్ధింపజేయగల మహిమ చూపేవారని ప్రతీతి. సనారి విశ్వేశ్వర అవధూత స్వామి, ఆయన భార్య అన్నపూర్ణతో కలిసి రాజయోగ ధర్మం పాటిస్తూ అన్నివర్గాల ప్రజలను శిష్యులుగా చేర్చుకున్నారని భక్తులు చెబుతుంటారు. ఈ స్వామి తన తపోబలంతో సాక్షాత్తు అపర పరమేశ్వరునిగా కీర్తింపబడుతున్నారు. ఆయన భార్య అన్నపూర్ణ వండిన వంటకాలను అక్షయపాత్రలో వేసి, నిత్యం వేలాది మందికి అన్నదానం చేసేవారని స్థానికులు అంటున్నారు. దీర్ఘకాలిక రోగులు, కురూపులకు స్వామి స్వాంతన కల్పించడంతో భక్తులకు స్వామిపై విశ్వాసం పెరిగింది. నిత్యం సూక్ష్మరూపంలోని కాశీ విశ్వేశ్వరుని దర్శనం తర్వాత స్వామి తన భక్తులకు దర్శనం ఇచ్చేవారని చరిత్ర చెబుతోంది. తన స్వగృహంలోనే భార్య అన్నపూర్ణ మృతదేహాన్ని దివ్య సమాధి చేసి, దానినే తన గురుపీఠంగా మార్చుకోవడం విశేషం. అప్పటి నుంచి స్వామి ఇక్కడే భక్తులకు దర్శనమిస్తుండడం గమనార్హం.

కోటిపల్లి జాతర..

శివరాత్రి పురస్కరించుకుని, మండలంలోని కోటిపల్లి గ్రామ ఎత్తైన కొండలపై కొలువుదీరిన ఉమాకాత్యాయని సహిత విశ్వేశ్వరాలయం వద్ద మూడు రోజుల పాటు జరిగే జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. అక్కడి విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకుంటారు.

మిన్నాజోలలో సంతాన పూజలు..

భామిని: మండలంలోని మిన్నాజోల హరిహర క్షేత్రం త్రివేణి సంగమంగా పేరొందింది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో వంశధార నదీ జన్మస్థానంగా పిలవబడే ఈ ప్రాంతంలో వెలసిన శ్రీమీనకేశ్వరునికి ఏటా శివరాత్రి రోజున భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఇరు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివస్తారు. పాలపాలియా, చవులదువా, భంశదరో మూడు నదుల సంగమం అనంతరం వంశధార నదిగా కొండచరియల నుంచి పారుతున్న స్థలమే మిన్నాజోల పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి. శివరాత్రి రోజున ఇక్కడ మీనాలు(చేపలు) ప్రసాదంగా స్వీకరించడం ఆనవాయితీ. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఇక్కడి మీనకేశ్వరుని పూజిస్తే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



భామిని: మిన్నాజోల త్రివేణి సంగమంలో భక్తుల పవిత్ర నదీ స్నానాలు(ఫైల్)



కొమరాడ: ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ ప్రసాద్, ఎస్‌ఐ జగదీష్‌నాయుడు



భామిని: పెద్దదిమిలిలో వెలసిన ఎండల మల్లన్న ఆలయం

కొమరాడ: మండలంలోని గుంపస్వామీశ్వరుని ఆలయం వద్ద జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను దేవదాయ శాఖ ఈఓ ప్రసాదరావు గురువారం పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ జగదీష్‌నాయుడుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన ఇక్కడి ఆలయానికి అటు ఒడిశా, ఇటు ఆంధ్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే తరుణంలో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

భామిని: మండలంలోని పక్కుడుబద్రలో నీలకంఠేశ్వరుడు, పెద్దదిమిలిలో ఎండల మల్లికార్జునుడు, ఘనసరలో మదన కామేశ్వర, బాలేరులో మల్లికార్జున, నేరడి–బిలో నీలకంఠేశ్వర, సాలికిరిలో కాశీవిశ్వేశ్వరాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.



పాలకొండలో వెలసిన అన్నపూర్ణ సహిత సనారీ విశ్వేశ్వరనాథుడు



జగన్నాథుని మందిరం దగ్గరలో పూజలందుకుంటున్న భీమలింగేశ్వరుడు



గరుగుబిల్లి: ముస్తాబైన గొట్టివలస శివాలయం



కోటిపల్లి కొండపై కొలువైన ఉమాకాత్యాయని సహిత విశ్వేశ్వరాలయం



భామిని: హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన భారీ నంది విగ్రహం

కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు

● మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, వేదికపై ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గురువారం మండలంలోని కొమరాడలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ తరగతులకు హాజరైన వారు వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలు పే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లే పార్టీ గెలుపు వారధులని, ప్రతీ ఇంటికి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. అలాగే ఎల్లోమీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తున్న ప్రసారాలను తిప్పికొట్టాలన్నారు. ఏది నిజం, ఏది అబద్ధమన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరూ తమ శక్తి మేర పార్టీ బలోపేతం, గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి జనార్దనరావు, సీనియర్ నాయకులు శెట్టి మధుసూదనరావు, మాజీ డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరావు, కొమరాడ పీఏసీఎస్ అధ్యక్షులు మరడాన సూరప్పనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, ఎంపీటీసీ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే గెలుపు వారధులు

● మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డోల జగన్, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు డోల జగన్, వేదికపై ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

వీరఘట్టం: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు వారధులని నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డోల జగన్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక కోదండరామ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశానికి వారు హాజరై, 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలను దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతం, ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. ప్రతిఒక్కరూ తొలుత ప్రభుత్వ పనులు, పథకాలపై అవగాహన పెంచుకుని, ఆ తర్వాత వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కోవిడ్ విపత్తు కాలంలో కూడా ప్రజలు కష్టపడకుండా ప్రభుత్వం చూసుకున్న విధానాన్ని తెలియజేయాలన్నారు. గతంలోని టీడీపీ హయాంలో ఉన్న పాలనకు, ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను వివరించగలగాలన్నారు. అలాగే ఎల్లోమీడియాలో వచ్చే ప్రభుత్వ వ్యతిరేక కథనాలు, ప్రసారాలు, అసత్య ప్రచారాలను ఖండించాలని, ఏది వాస్తవమో దానికి జనానికి తెలపాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మన పార్టీని మరోసారి అధికారంలోకి తెచ్చి, మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కిట్లను నేతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు దిబ్బ లలితకుమారి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, భోగి మణి, దమలపాటి ఉమా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి




మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశమైన డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: డ్వాక్రా సంఘాల్లోని మహిళలంతా ఆర్థిక పురోగతి సాధించాలని, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సీసీలతో సమావేశమైన ఆయన జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత గ్రౌండింగ్, పీఎంజేబీవై, పీఎంఎస్‌బీవై, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, వీఆర్‌ఎఫ్, హెచ్‌డీఎఫ్ తదితర ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించారు. మహిళలు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఏపీఎం ఆదయ్య పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల బలోపేతం, స్త్రీనిధి రుణాలపై డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్, మహిళా మార్ట్, జగనన్న తోడు లక్ష్యాలకు సంబంధించి, చర్చించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వెంకట్, సీసీలు, మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం: మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య సిబ్బందితో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మహిళల ఆర్థిక ప్రగతికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మహిళా మార్ట్‌లు నెలకొల్పి, మహిళలు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టేలా ప్రోత్సహించాలన్నారు. జగనన్న తోడు లక్ష్యాలు అధిగమించేందుకు బ్యాంకు అధికారులతో మాట్లాడి, రుణాలు ఇప్పించాలన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాల్లో తప్పనిసరిగా మెనూ అమలు చేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. గురువారం మండలంలోని శివ్వాం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు అందజేయాలని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అభినవ్‌కుమార్

కురుపాం: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.అభినవ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో 104 సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా అక్కడి ఆశ్రమ పాఠశాలలోని 52 మంది విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే సమాజ ఆరోగ్యం సాధ్యమని, దీనికన్నా ముందు అందరూ వ్యక్తిగత శుభ్రత పాటించడం అనివార్యమన్నారు. భోజనం చేసే ముందు రెండు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు.


నేడు గృహసారథుల సమావేశం

గరుగుబిల్లి: మండలంలోని ఎర్రన్నగుడి కూడలిలో వైఎస్సార్ సీపీ గృహసారథుల సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. మధ్యాహ్నం జరిగే ఈ సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పాల్గొంటారని, పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లంతా హాజరు కావాలని కోరారు.

నేడు 'మా నమ్మకం నువ్వే జగనన్న'

పాలకొండ రూరల్: స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానం సమీపంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డోల జగన్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాల్గొంటారని, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో పాటు నేతలు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: మండలంలోని కళ్లికోట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన కొలతల మేర రెండు పూటలా పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనులకు రాని వారికి మస్తర్లు వేయొద్దని సూచించారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటింటికీ వైద్యసేవలు


–కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా చేస్తున్న రక్తపరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్

వీరఘట్టం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు అందించడం జరుగుతోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చలివేంద్రి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలును పరిశీలించిన ఆయన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, మంచానపడిన రోగులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు కృషి చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 449 హెల్త్ సెంటర్ల పరిధిలో ప్రతిరోజూ చేపట్టే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా 14 రకాల పరీక్షలు చేసి, 67 రకాల మందులు అందజేస్తున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జగన్నాథరావు తెలిపారు. అనంతరం మండలంలోని నడిమికెల్ల గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందజేయాలని పీడీ విజయగౌరికి సూచించారు. కార్యక్రమంలో వీరఘట్టం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ అధికారి వినోద్, సీతంపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జనార్దననాయుడు

పాలకొండ రూరల్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని ప్రిన్సిపాల్ జి.జనార్దన నాయుడు సూచించారు. గురువారం స్థానిక కళాశాలలో నిర్వహించిన ఓపెన్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇక్కడ బీఏ(హెచ్‌ఈపీ), బీ–కామ్(జనరల్), ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయని, ప్రతీ కోర్సులో 60 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో కన్నా ఇక్కడ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, దీంతో విద్యార్థుల జాయినింగ్ సంఖ్య కూడా ఏటా పెరుగుతోందన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకునే విద్యార్థులు తమ కళాశాలలో చేరాలని కోరారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుచేయాలి



ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ నోటిఫికేషన్ పత్రం గోడపై అతికిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయాలని తహసీల్దార్ అజు రఫీజాన్ సూచించారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ పత్రం గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయాలని ఎంపీడీఓ దొంక త్రినాథులు సూచించారు. గురువారం మండలంలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ మహిళా పోలీసులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో సమావేశమైన ఎన్నికల వేళ పార్టీల ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఎక్కడా లేకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు.